

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 12-12-2025 | సంపుటి - 26 | సంచిక -205 | రూ : 4 | పేజీలు: 8



2లో

## హైదరాబాద్‌లో
### ఒకేచోట నాలుగు కార్లు దగ్ధం

- రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో దగ్ధమైన కార్లు
- ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయిన కారు, ట్రాలీ
- మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నం

## మెస్సీ ఈవెంట్ కు
# రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

- మెస్సీ హైదరాబాద్ పర్యటన ప్రైవేట్ కార్యక్రమం అని రేవంత్ వెల్లడి
- ఈవెంట్‌కు హాజరు కావాలని రాహుల్, ప్రియాంకలకు ఆహ్వానం
- ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్



2లో

## శీతాకాల విడిది కోసం..
# హైదరాబాద్ వస్తున్న రాష్ట్రపతి ముర్ము
### సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



2లో



2లో

## ఇస్రో దూకుడు...

- డిసెంబర్ 15న అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహ ప్రయోగం
- ఇస్రో అత్యంత శక్తిమంతమైన LVM3 రాకెట్‌తో ఈ ప్రయోగం
- బ్లూ బర్డ్-6 కమ్యూనికేషన్ శాటిలైట్ బరువు 6.5 టన్నులు
- భారత్-అమెరికా మధ్య ఇది రెండో అతిపెద్ద అంతరిక్ష సహకారం

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్..
# ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చ!

- ప్రధాని మోదీకి ఫోన్ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ
- వాణిజ్యం, రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారంపై సమీక్ష
- త్వరలో భారత్‌లో పర్యటిస్తానని ఇటీవల వ్యాఖ్యానించిన ట్రంప్
- మోదీ గొప్ప నాయకుడని, తన స్నేహితుడని ప్రశంసలు



2లో

## రేపు విశాఖలో
# సీఎం, మంత్రి పర్యటన
### కాగ్నిజెంట్, సత్వా క్యాంపస్‌లకు భూమి పూజ

- విశాఖలో కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ భారీ పెట్టుబడులు
- రేపు రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న సీఎం, మంత్రి లోకేశ్
- మరో 7 ఐటీ క్యాంపస్ లకు కూడా భూమిపూజ చేయనున్న లోకేశ్
- రూ.3000 కోట్లకు పైగా పెట్టుబడులు, 33 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు



2లో



2లో

## స్థానిక భక్తులకు ఈ-డిప్ విధానంలో
# వైకుంఠ ద్వార దర్శనం.. టీటీడీ ప్రకటన

- డిసెంబర్ 27 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- జనవరి 6, 7, 8 తేదీల కోసం రోజుకు 5,000 టోకెన్ల కేటాయింపు
- తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి వాసులకు ప్రత్యేక కోటా
- డిసెంబర్ 31న లాటరీ పద్ధతిలో టోకెన్ల కేటాయింపు

# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్... ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చ!

ఢిల్లీ, డిసెంబర్ 11: భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయనడానికి సూచికగా, ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం టెలిఫోన్ సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాల పురోగతితో పాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించుకున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కొనసాగించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "అధ్యక్షుడు ట్రంప్‌తో చాలా ఆత్మీయంగా, ఫలవంతంగా సంభాషణ జరిగింది. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించాం. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించాం. ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేయడం కొనసాగిస్తాయి" అని పేర్కొన్నారు. 'భారత్‌అమెరికా సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం'లో పురోగతిని నేతలిద్దరూ సమీక్షించారు. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారం నిలకడగా బలపడుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'ఇండియా-యూఎస్ కాంపాక్ట్' అమలులో భాగంగా కీలకమైన సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత వంటి ప్రాధాన్యతా రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉమ్మడి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు. ఇదిలా ఉండగా, గత నెలలో ట్రంప్ ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీని "గొప్ప వ్యక్తి", "నా స్నేహితుడు" అని అభివర్ణిస్తూ, త్వరలోనే భారత్‌లో పర్యటించాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. నవంబర్ 6న వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "మోదీ నా స్నేహితుడు, మేం మాట్లాడుకుంటాం. నన్ను అక్కడికి రమ్మని కోరుతున్నారు. నేను వెళతాను" అని అన్నారు. 2020లో తన భారత పర్యటన అద్భుతంగా జరిగిందని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. భారత్‌తో వాణిజ్య చర్చలు చాలా సానుకూలంగా సాగుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ కూడా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ పట్ల ట్రంప్‌కు గొప్ప గౌరవం ఉందని, ఇరువురు నేతలు తరచుగా మాట్లాడుకుంటారని ఆమె తెలిపారు. వాణిజ్య అంశంపై భారత ప్రతినిధులతో తమ బృందం ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోందని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా జరిగిన ఫోన్ సంభాషణ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

## స్థానిక భక్తులకు ఈడిప్ విధానంలో వైకుంఠ ద్వార దర్శనం... టీటీడీ ప్రకటన

తిరుమల, డిసెంబర్ 11: తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం ఎదురుచూస్తున్న తిరుపతి, తిరుమల స్థానిక భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుభవార్త చెప్పింది. స్థానికుల కోసం ప్రత్యేక కోటా కింద ఈడిప్ (ఎలక్ట్రానిక్ డిప్) విధానంలో దర్శన టోకెన్లను జారీ చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 6, 7, 8 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనం కోసం రోజుకు 5,000 చొప్పున టోకెన్లు కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ టోకెన్ల కోసం డిసెంబర్ 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి డిసెంబర్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్టర్ చేసుకున్న భక్తులకు డిసెంబర్ 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు లాటరీ పద్ధతిలో టోకెన్లను కేటాయిస్తారు. కేటాయించిన 5,000 టోకెన్లలో తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల స్థానికులకు 4,500, తిరుమలలో నివసించే స్థానిక భక్తులకు 500 టోకెన్లు రిజర్వ్ చేశారు. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ లేదా వాట్సాప్ ద్వారా 1+3 విధానంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని స్థానిక భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ కోరింది.

## మెస్సీ ఈవెంట్ కు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 11: ప్రపంచ ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ హైదరాబాద్ పర్యటన పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని, దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మెస్సీ పర్యటనను ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోందని, ప్రభుత్వం కేవలం అవసరమైన సహకారం మాత్రమే అందిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు నగరానికి వస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి తాను కూడా ఒక అతిథిగా మాత్రమే హాజరవుతున్నానని చెప్పారు. ఈ ఈవెంట్‌కు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో కలిసిన ప్రముఖులను కూడా ఈ కార్యక్రమానికి రావాలని కోరినట్లు తెలిపారు. 'మెస్సీ గోట్ ఇండియా టూర్'లో భాగంగా ఈ నెల 13న మెస్సీ హైదరాబాద్ రానున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆయన పాల్గొంటారు. ఈ మ్యాచ్‌లో మెస్సీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు కూడా రెండు జట్లుగా విడిపోయి ఆడనున్నారు. మెస్సీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## శీతాకాల విడిది కోసం
## హైదరాబాద్ వస్తున్న రాష్ట్రపతి ముర్ము

హైదరాబాద్, డిసెంబర్ 11: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌లో ఐదు రోజుల పర్యటనకు రానున్నారు. తన వార్షిక శీతాకాల విడిదిలో భాగంగా డిసెంబర్ 17 నుంచి 21 వరకు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఆమె బస చేయనున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పటిష్టమైన భద్రత, ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ శాఖను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ టెండర్లు, ప్రత్యేక వైద్య బృందాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

## రేపు విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పర్యటన

అమరావతి, డిసెంబర్ 11: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విశాఖపట్నం ఐటీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. నగరాభివృద్ధిలో కీలక మైలురాళ్లుగా నిలిచే రెండు భారీ ప్రాజెక్టులకు రేపు (డిసెంబరు 12) శ్రీకారం చుట్టనున్నారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్‌తో పాటు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ తమ క్యాంపస్‌ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా విశాఖలో రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడులు రానుండగా, ప్రత్యక్షంగా 33 వేలకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. విశాఖ కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాల్లో నిర్మించనున్న కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తారు. ఈ సంస్థ రూ.1,583 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఈ క్యాంపస్‌ను నిర్మించనుంది. దీని ద్వారా 8 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2033 నాటికి నిర్మాణం పూర్తి కానుండగా, మొదటి దశను 2029 నాటికి పూర్తి చేసి 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో, రుషికొండలోని మహతి ఫిన్ టెక్ భవనంలో వెయ్యి సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలపై దృష్టి సారిస్తుంది. మరోవైపు, దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ విశాఖ మధురవాడలోని హిల్ 4లో నిర్మించనున్న 'సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్'కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా 40 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ క్యాంపస్‌లో కేవలం ఐటీ కార్యాలయాలే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో నివాసాలు, రిటైల్, హాస్పిటాలిటీ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో భారీ ప్రాజెక్టులు నిర్మించిన సత్వా గ్రూప్, విశాఖలో రాబోయే ఐదేళ్లలో 4 మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖపట్నం త్వరలోనే గ్లోబల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ తో పాటు విశాఖపట్నంలో మరో 7 ఐటీ సంస్థల క్యాంపస్ ల నిర్మాణాలకు కూడా నారా లోకేశ్ రేపు భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు.

1. టెక్ తమ్మిన (Tech Tammina (Sree Tammina Software Solutions Pvt. Ltd)
* విశాఖ మధురవాడలోని ఎస్పీఎల్ 4, హిల్ నెం 2లో ఏర్పాటుకానున్న టెక్ తమ్మిన సంస్థ రూ.62 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 500 మందిగి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం అమెరికాలో ఉంది. నెదర్లాండ్స్, దుబాయ్, ఇండియాలో తన సేవలను అందిస్తోంది.
2. నాన్ రెల్ టెక్నాలజీస్ (Nonrel Technologies Private Limited)
* విశాఖ నాన్ ఐటీ సెజ్, హిల్ నెం 2లో ఏర్పాటుకానున్న నాన్ రెల్ టెక్నాలజీస్ సంస్థ రూ.50.60 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 567 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
3. ఏసీఎన్ ఇన్ఫోటెక్ (ACN HealthCare RCM Services Pvt Ltd)
* విశాఖ ఐటీ సెజ్ హిల్ నెం 2లో ఏర్పాటుకానున్న ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్ సీఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.30 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థ 12 నెలల్లో తన వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది.
4. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ (Imaginnovate Techsolutions (India) Pvt Ltd)
* విశాఖ భీమిలిలోని కాపులుప్పాడలో ఏర్పాటుకానున్న ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ రూ.140 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2,600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
5. ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ (Fluentgrid Limited)
* విశాఖ భీమిలి మండలం కాపులుప్పాడలో ఏర్పాటుకానున్న ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
* 6. మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (Motherson Technology Services Limited)
* విశాఖపట్నం కాపులుప్పాడ ఫేజ్ 1 ఐటీ పార్క్ లో ఏర్పాటుకానున్న మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ రూ.109.73 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 1,775 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
7. క్వార్క్స టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ (Quarks Technosoft Pvt Ltd)
* విశాఖ కాపులుప్పాడలో ఏర్పాటుకానున్న క్వార్క్స టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.115 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## ఇస్రో దూకుడు... డిసెంబర్ 15న
## అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహ ప్రయోగం

అమెరికా, డిసెంబర్ 11: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగాల్లో మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. అమెరికాకు చెందిన 6.5 టన్నుల బరువున్న 'బ్లూబర్డ్ 6' కమ్యూనికేషన్స్ ఉపగ్రహాన్ని డిసెంబర్ 15న నింగిలోకి పంపనుంది. ఇస్రోకు చెందిన అత్యంత శక్తిమంతమైన లాంచ్ వెహికల్ మార్క్ 3 (LVM3) రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్న అత్యంత బరువైన ఉపగ్రహాలలో ఇది ఒకటి. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగం కోసం అక్టోబర్ 19నే ఈ ఉపగ్రహం అమెరికా నుంచి భారత్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. ఇది కక్ష్యలో అతిపెద్ద కమర్షియల్ ఫేజ్డ్ అర్రేను కలిగి ఉంటుందని, గతంలో పంపిన బ్లూబర్డ్ ఉపగ్రహాల కన్నా 10 రెట్లు అధిక డేటా సామర్థ్యంతో పనిచేస్తుందని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (NSIL) ఈ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తోంది.




## ఔరంగాబాద్‌లో భారత్ గౌరవ్ అవార్డు – 2025 అందుకున్న సయ్యద్ మెహతాజ్ బేగం

ఔరంగాబాద్ (మహారాష్ట్ర): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 10న మహారాష్ట్ర రాష్ట్రంలోని ఔరంగాబాద్ నగరంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక "భారత గౌరవ్ అవార్డ్- 2025" కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సయ్యద్ మెహతాజ్ బేగం గారు భారత్ గౌరవ్ అవార్డు అందుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన మెహతాజ్ బేగం గారు గత కొంతకాలంగా సామాజిక న్యాయం, మహిళా సాధికారత, మానవ హక్కుల రక్షణ, బాధితుల పట్ల న్యాయం మరియు అవగాహన కార్యక్రమాల్లో విశేష సేవలను అందిస్తూ ముందంజలో నిలుస్తున్నారు. ఆమె సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు అనేక కుటుంబాలకు ఆశాకిరణం అయ్యాయి. ఈ సేవలను పరిగణనలోకి తీసుకుని, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఆర్. అన్సారీ గారు స్వయంగా ఆమెకు అవార్డు అందజేశారు. దేశం నలుమూలల నుండి ప్రతిభావంతులు, సేవాభావం కలిగిన వ్యక్తులు పాల్గొన్న ఈ అవార్డు కార్యక్రమంలో మెహతాజ్ బేగం గారి పేరు వినిపించడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గౌరవం లభించింది. అవార్డు స్వీకరించిన అనంతరం, తనను ఈ పురస్కారానికి నామినేట్ చేసిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్ గారికి సయ్యద్ మెహతాజ్ బేగం గారు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవ పట్ల తన కట్టుబాటును మరింత బలోపేతం చేస్తూ, భవిష్యత్తులో మహిళల భద్రత, విద్య, హక్కుల పరిరక్షణ, అణగారిన వర్గాల అభ్యున్నతికి మరింత శ్రమిస్తానని ఆమె తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా విభాగానికి వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్రాధ్యక్షురాలిగా సేవలు అందిస్తున్న మెహతాజ్ బేగం గారి ఈ సాధన, రైల్వే కోడూరు - అన్నమయ్య జిల్లాకు గర్వకారణమై నిలిచింది. స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాలు ఆమె విజయంపై ఆనందం వ్యక్తం చేశారు.

## అమరావతి క్వాంటమ్ వ్యాలీలో రూ.200 కోట్లతో గ్లోబల్ బయో ఫౌండ్రీ




ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, అత్యాధునిక సాంకేతిక పరిశోధనలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న 'క్వాంటమ్ వ్యాలీ'ని వేదికగా చేసుకొని, నూతన ఔషధాలు, మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలు చేసేందుకు 'గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ' ముందుకొచ్చింది. రూ. 200 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పలు దేశాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో కూడిన బృందం సమావేశమై తమ ప్రతిపాదనలను వివరించింది. ఈ సందర్భంగా గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ప్రతినిధులు మాట్లాడుతూ, అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఈ కేంద్రం దేశంలోనే తొలి క్వాంటమ్ బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా నిలుస్తుందని తెలిపారు. మాలిక్యులర్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ సిమ్యులేషన్స్, మెటీరియల్ సైన్స్ వంటి క్లిష్టమైన రంగాల్లో తమ పరిశోధనలు సాగుతాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ ప్రభుత్వ విధానాలు, క్వాంటం వ్యాలీ ఏర్పాటు వంటి అంశాలు తమను ఎంతగానో ఆకర్షించాయని వారు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వైద్యారోగ్యం, ఔషధాల తయారీ వంటి రంగాల్లో విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. క్వాంటమ్ పరిశోధనల ద్వారా బయోసెన్సార్ల వంటి అప్లికేషన్లను అభివృద్ధి చేసి, వాటి ఫలాలను ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గతంలో ఐటీ, జీనోమ్ వ్యాలీ వంటివి ఎలా విజయవంతమయ్యాయో, ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ కూడా అదే స్థాయిలో నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే అమరావతిలో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రం (ఏక్యూసీసీ) కార్యకలాపాలు ప్రారంభిస్తుందని చంద్రబాబు తెలిపారు. జాతీయ క్వాంటమ్ మిషన్‌ను అందిపుచ్చుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళుతోందని వివరించారు. క్వాంటమ్ బయో ఫౌండ్రీ ఏర్పాటు ఒక వినూత్న ఆలోచన అని అభినందించారు.

# తక్షణమే డివిజన్ పేరు మార్చాలి



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : జిహెచ్ఎంసి పునర్విభజనలో ఇంత ముందుకున్న మల్కాజిగిరి డివిజన్ ను రెండు భాగాలుగా విభజించి ఒకదానికి బలరాం నగర్ మరొక దానికి సఫిల్గుడా పేరు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా నేరెడ్మెట్ స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు.ఈ సందర్భంగా నేరేడ్ మెట్ వాసులు మాట్లాడుతూ బలరాం నగర్ అనే పేరును తొలగించి నేరేడ్ మెట్ డివిజన్ గా మార్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నేరేడ్ మెట్ వాసులకు రాబోయే జిహెచ్ఎంసి ఎలక్షన్లో టికెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలలింగం,చాకో,పీ.బీ.సుందర్ యాదవ్, తుపాకుల జనార్ధన్, గంగాధరి కృష్ణ, జీ. శ్రీనివాస్ యాదవ్, ఎలిమెల ప్రశాంత్, యాదవ్, ఎనిమళ.గణేష్, బళ్లారి అశోక్, జంగిలి శివకుమార్, సానాది శంకర్, తుపాకుల కోటేశ్వర్, టి.మురళీ గౌడ్, కటికల నరేష్,ఈ.నందు యాదవ్, ఏ.ఎల్.లక్ష్మీపతి, మోర శ్రీకాంత్,పీ.ఈశ్వర్ యాదవ్, బీ.ఈశ్వర్ గౌడ్, జీ.రమేష్, ఏ.రాజు, పీ.శ్రీశైలం, ఎస్.రాజ్ గౌడ్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్వో



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పాల్వంచలోని శ్రీ విజయ నర్సింగ్ హోమ్ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, అందుకు వసూలు చేస్తున్న ఫీజుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందించే సేవల ఫీజుల లిస్ట్ను రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా ల్యాబ్లో నిర్వహించే రక్తపరీక్షల ధరల జాబితా కూడా రిసెప్షన్ వద్ద ఉంచాలని, ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ల పేర్లను కూడా స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. వైల్స్ మూత తొలగించిన వెంటనే, వాటిపై తేదీ, సమయం తప్పనిసరిగా నమోదు చేయాలని సిబ్బందికి చెప్పారు. కాన్పులు నిర్వహించే గదులను శుభ్రంగా ఉంచి, అవసరమైన మందులను తగిన విధంగా నిల్వ చేయాలన్నారు. ఆసుపత్రి నిర్వహణలో లోపాలు పునరావృతం కాకుండా చూడాలని డీఎంహెచ్వో హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డీవైపీఎంఓ మోహన్ పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్ట డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తా

*** జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తానని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. గురువారం సాయంత్రం డివిజన్ పరిధి మగ్దూం నగర్,భగత్ సింగ్ మార్గ్ చౌరస్తా లో నూతనంగా ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైటింగ్ సిస్టం ను స్థానిక బస్తి వాసులతో కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్,శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు, స్థానిక నాయకులు ఎండి.పాషా, వెంకట్ రెడ్డి, ఎండి. ఆజం, ముంతాజ్ అలీ, మహమ్మద్,మౌలానా,ఖదీర్, నర్సింగ్,సందీప్,సులేమాన్, విఘ్నేష్, నాయకులు మల్లికార్జున్, చంద్రశేఖర్,నరసింహారెడ్డి, యాదగిరి,ఖాజా భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. పుట్టిన గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

*** కొత్త శిరీష ధనరాజ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజలు ఆశీర్వదిస్తే.. తాను పుట్టిన గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని బిజెపి బలపరిచిన బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త శిరీష ధనరాజ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో బిజెపి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వీధులన్నీ కలియ తిరుగుతూ, ముఖ్యంగా వృద్ధులను మహిళలను, ఆప్యాయంగా పలకరిస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కత్తెర గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని గ్రామ ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కొత్త శిరీష ధనరాజ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా సర్పంచ్ గా బరిలోకి దిగానన్నారు. గ్రామ ప్రజలు తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ గా తనను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానన్నారు. ముఖ్యంగా గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానన్నారు. రోజు రోజుకి గ్రామం పెరుగుతున్న నేపథ్యంలో ఉన్న ఒక ఫిల్టర్ సరిపోవడం లేదని, తాగునీటికి సమస్యగా ఉందని, మరో ఫిల్టర్ ను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పూర్తిగా రూపుమాపుతానన్నారు. గ్రామ ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమన్నారు. గెలిచినా వెంటనే యువతకు కావాల్సిన క్రీడ ప్రాంతాన్ని క్రీడలు ఆడేందుకు వీలుగా పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గ్రామంలోని యువతను క్రీడారంగంలో నిరంతరం తోడ్పాటున అందించడంతో పాటు సొంత నిధులు ఖర్చు చేస్తానని యువతకి హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి, గ్రామంలో ఆసుపత్రి నిర్మాణానికి సొంత నిధులు వెచ్చిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా 24గంటలు ఉచిత అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రామ ప్రజలు తలను ఆశీర్వదించి కత్తెర గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, బూడిద దేవేందర్ రెడ్డి, 1వ వార్డు అభ్యర్థి గట్టు రవి, 2వ వార్డు అభ్యర్థి సుంకరి శ్రీనివాస్, 3వ వార్డు అభ్యర్థి దేశట్ల మహేష్, 4వ వార్డు అభ్యర్థి దేశట్ల చైతన్య, 5వ వార్డు అభ్యర్థి సిలువేరు రమేష్, 6వ వార్డు అభ్యర్థి పులిగిల్ల శ్రీనివాస్ చారి, 7వ వార్డు అభ్యర్థి సుంకరి సుచరిత, 8వ వార్డు అభ్యర్థి ముదుగుల శంభయ్య, 9వ వార్డు అభ్యర్థి నవ్య నరేష్, 10వ వార్డు అభ్యర్థి జిన్నమోని మమత తదితరులు పాల్గొన్నారు.



# నైతిక విలువలతో కూడిన సాంకేతిక వినియోగం, ప్రత్యేకంగా కృత్రిమ మేధస్సు పై దృష్టి పెట్టాలి

*** తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ డా. బాలకిష్ట రెడ్డి**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : నిరంతర నైపుణ్యాభివృద్ధి, నైతిక విలువలతో కూడిన సాంకేతిక వినియోగం, ప్రత్యేకంగా కృత్రిమ మేధస్సు పై దృష్టి పెట్టాలని తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ డా. బాలకిష్టరెడ్డి అన్నారు. కేం.జీ. రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఫస్ట్ ఇయర్ బీ టెక్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సెషన్ను తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ డా. బాలకిష్టరెడ్డి సందర్శించి, విలువైన ప్రసంగం అందించారు. ఈ సందర్భంగా డా. రెడ్డి మాట్లాడుతూ భారత దేశ భవిష్యత్తును మలిచే సాంకేతిక విజ్ఞానానికి వేగంగా పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులు ఆవిష్కరణ, ప్రోత్సహించారు. భారత రాజ్యాంగంలోని ప్రాస్తావికం లోని సార్వభౌమత్వం, సామ్యవాదం, లౌకికత్వం, ప్రజాస్వామ్యం, గణతంత్రం, న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ , సౌభ్రాతృత్వం వంటి మూలభూత విలువల ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులు విద్యా ప్రయాణంలోనూ, వృత్తి జీవితంలోనూ ఈ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని ప్రేరేపించారు.కార్యక్రమం చివరగా కేం.జీ. రెడ్డి కాలేజ్ డైరీను ప్రొఫెసర్ డా. బాలకిష్ట రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేం.జీ. రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్మన్ లయన్ కె. కృష్ణ రెడ్డి, డీన్ అకడెమిక్స్ డా. ఎం.ఎన్. నరసయ్య , అరిస్టాటిల్ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు.

# 1990వ రోజు మొక్క నాటిన ప్రకృతి ప్రేమికుడు కె.ఎన్. రాజశేఖర్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రతి రోజూ ఒక మొక్క నాటుతూ ప్రకృతి సంరక్షణకు కృషి చేస్తున్న కె.ఎన్. రాజశేఖర్ గురువారం 1990వ రోజును జరుపుకున్నారు. సింగరేణియన్గా విధులు నిర్వహిస్తూనే పర్యావరణ పరిరక్షణకారుడిగా గుర్తింపు పొందిన ఆయన 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ చేత ప్రశంసలు పొందిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం సింగరేణి కార్పొరేట్ ఉమెన్స్ జూనియర్ కాలేజీ ఆవరణలో ఔషధ మొక్కలతో హెర్బల్ గార్డెన్ ఏర్పాటు చర్యల్లో భాగంగా 'సీతా అశోక' మొక్కను నాటారు. లెక్చరర్ అరుణకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.ప్రధాని ప్రారంభించిన 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమం మేరకు తల్లుల పేరుతో మొక్కలు నాటాలని విద్యార్థినులకు సందేశం ఇచ్చిన రాజశేఖర్ను ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందించారు.

# అవకాశం ఇవ్వండి.. అభివృద్ధితో గ్రామ ముఖచిత్రాన్ని మారుస్తా:

**- పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామ ప్రజలు అవకాశం ఇచ్చి తనను గెలిపిస్తే.. అభివృద్ధి చేసి గ్రామ ముఖచిత్రాన్ని మారుస్తానని కాంగ్రెస్ పార్టీ పీపల్ పహడ్ సర్పంచ్ అభ్యర్థి పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం పీపల్ పహడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువతతో కలిసి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఆప్యాయంగా పలకరిస్తూ మహిళలకు బొట్టు పెట్టి కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత 10సంవత్సరాల నుంచి గ్రామంలో అన్ని రకాల కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నామన్నారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా సాయం చేయడానికి వెనకాడ లేదని గుర్తు చేశారు. గ్రామ ప్రజల కష్ట నష్టాలలో వారికి తోడున్నానన్నారు. పదవి లేకున్నా గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో ప్రస్తుతం గ్రామ సర్పంచ్ గా బరిలోకి దిగానన్నారు. మహిళలు, యువత నుంచి వస్తున్న ఆదరణ, అభిమానం పట్ల సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజలు సహకరించాలని, కత్తెర గుర్తుకు ఓటు వేసి తమ ఆశీస్సులు అందించాలని కోరారు. తాను గెలిచిన వెంటనే గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి గ్రామ ముఖచిత్రాన్ని పూర్తిగా మారుస్తానన్నారు. గ్రామ ప్రజలు తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



# ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధినేతలు వెంకటస్వామి, చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా మునిపల్లి గ్రామానికి చెందిన పెద్దగొల్ల పార్వతమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారులు పెద్దగొల్ల నాగరాజు, నరసింహులు ఐడియల్ కూకట్ పల్లి చెరువు దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది దివ్యాంగులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పెద్దగొల్ల పార్వతమ్మ ఇటీవల అకాల మరణం చెందారని, వారి ఆత్మ శాంతించాలన్నారు.న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తమతల్లి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం న్యూ శక్తి దివ్యాంగుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు

# టాటా ఏఐఏ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

*** సేవా కార్యక్రమాల్లో టాటా ఎల్లప్పుడూ ముందుంటుంది: బీఎం సతీష్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ రంగంలో అత్యున్నత పురస్కారాల్లో ఒకటి అయిన మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ (ఎం.డి.ఆర్.టి.) సాధించిన ఝాన్సీ రాణి ఫైనాన్షియల్ సర్వీసెస్కు చెందిన అడ్వైజర్ వెనమల్ల సామ్రాజ్యంను కొత్తగూడెం బ్రాంచి మేనేజర్ జె. సతీష్ అభినందించారు. ఈ సందర్భంగా గురువారం కొత్తగూడెం పట్టణం చమన్బస్తీనందుగల శ్రీ జ్యోతి అనాధ వృద్ధాశ్రమంలో ఝాన్సీ రాణి ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో కొచ్చర్ల కమలారాణి ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఎం సతీష్ మాట్లాడుతూ 156 సంవత్సరాల చరిత్ర కలిగిన టాటా ఏఐఏ దేశం కోసం ఎన్నో సేవలు అందిస్తుందని అన్నారు. కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రూ.1500 కోట్లను విరాళంగా ఇచ్చి తన ఉదార స్వభావాన్ని చాటుకుందని గుర్తుచేశారు. అటువంటి సంస్థలో పనిచేస్తున్న తాము తమవంతు సహాయంగా ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అనంతరం ఝాన్సీ రాణి ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో కమలారాణి మాట్లాడుతూ తమ అసోసియేషన్లో అడ్వైజర్ సామ్రాజ్యం మొట్టమొదటి ఎండిఆర్టి సాధించినందుకుగాను సంతోషంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే చలికాలంలో అనాధ వృద్ధులకు అవసరమైన 40 దుప్పట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. అనాధలు, వృద్ధులు దైవంతో సమానమని, వారికి ఎవరికి తోచిన విధంగా వారు సహాయపడాలన్నారు. ఎండిఆర్టి సాధించిన సామ్రాజ్యం మాట్లాడుతూ టాటా సంస్థలో చేరిన కొద్ది కాలంలోనే బీఎం సతీష్, బీఏఎం రాహుల్, ఎస్బీఏ కమలారాణిల సహకారంతోనే తాను ఎండిఆర్టి సాధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జ్యోతి అనాధాశ్రమం నిర్వాహకురాలు పట్నం జ్యోతి, కొచ్చర్ల దేవరాజ్, మనోజ్, చింతల నాగచందర్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కాలనీ, బస్తీలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యం

*** బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రతి కాలనీ, బస్తీలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గురువారం గాజులరామారం డివిజన్ పరిధిలోని రోడమేస్త్రీ నగర్ బీ కాలనీలో నెలకొన్న సీసీ రోడ్డు , డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక శాసనసభ్యులు కె. పి. వివేకానంద్ సంబంధిత శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్ల దుస్థితి, వర్షాకాలంలో నిల్వ ఉండే మురుగు నీరు, డ్రైనేజీ అడ్డంకుల వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను నిశితంగా పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, జిహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైనేజ్ మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. రోడమేస్త్రీ నగర్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిష్టప్ప, స్థానికులు షేక్ ముజ్జు, షేక్ అమీర్, ఫర్జానా బేగం, షమీమ్ బేగం, షాహ నవాజ్, శాదూల్, మొహసిన్, పార్టీ నాయకులు కస్తూరి బాలరాజు, కమలాకర్, తెలంగాణ సాయి మక్సూద్ అలీ, ఇబ్రహీం, ఇమ్రాన్, నాగేష్, మహేష్,చెట్ల వెంకటేశ్, మద్దెల సాయిబాబా, శివ నాయక్, బాబి చౌదరి, హనుమంత్ నాయక్, లక్ష్మణ్, జునైద్ మరియు కాలనీ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి.. అభివృద్ధి పథంలో తీసుకెళ్తా

**- దండు మల్కాపురం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గిర్కాటి నిరంజన్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామ ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తే.. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని దండు మల్కాపురం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గిర్కాటి నిరంజన్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గిర్కాటి నిరంజన్ గౌడ్ గురువారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బ్యాటు గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గిర్కాటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి చేపట్టడంతోనే అందాకారం అలుముకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారం చేపట్టిన గత దశాబ్ద కాలం పాటు గ్రామాలు అభివృద్ధిపథంలో నడిచాయన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. గ్రామాల్లో ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డ్ లు, వైకుంఠధామాలు ఏర్పాటు చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వం సొంతమన్నారు. ఇప్పటికైనా గ్రామంలో ప్రజలు ఆలోచించి గ్రామాలను అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమన్నారు. సర్పంచ్ గా ఒక్కసారి అవకాశం కల్పిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అందరి సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. బ్యాట్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదర్శంగా.. గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

**: బద్దం మమత (అర్ధ పల్లవి) వెంకట్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని గ్రామాభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అల్లాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థి బద్దం మమత (అర్ధ పల్లవి) వెంకట్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వీధులన్నీ కలియ తిరుగుతూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులతో మాట్లాడుతూ బ్యాటు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బద్దం మమత (అర్ధ పల్లవి) వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తూనే ఉందన్నారు. ముఖ్యంగా నూతన రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పథకాలు ప్రతి ఇంటికి అందాయన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగానన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంతో పాటు గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానన్నారు. గ్రామంలో అవసరమైన చోట సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తానన్నారు. అదేవిధంగా యువతకు క్రీడా ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ క్రీడలు వాడేందుకు వీలుగా అందుబాటులోకి తెస్తానన్నారు. అదేవిధంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానన్నారు. బ్యాట్ గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## ఒకే బస్తీలోని గల్లీలను ఒకే డివిజన్లో కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలి

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : డివిజన్ల పునర్విభజన సందర్భంగా జరిగిన లోటుపాట్లను సరిదిద్ది ఒకే బస్తీలో ఉన్నటువంటి అన్ని గల్లీలను ఒకే డివిజన్లో కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. డివిజన్ల పునర్ విభజనలో మార్పులు చేయాలని గురువారం గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి హెచ్ ఎమ్ సీ డివిజన్ విభజన గంధరగోళంగా ఉందని ఒకే బస్తి లోని కొన్ని గల్లీలు ఒక డివిజన్ కి మరికొన్ని గల్లీలు ఇతర డివిజన్లకు కేటాయించారని, ఒకే ఇంటి నెంబర్ కు వచ్చే క్రమ సంఖ్యలు కూడా ఒక్కొక్క డివిజన్ కి కేటాయించారన్నారు. చిరునామాలోని పిన్ కోడ్ ఒక్కటే ఉన్నప్పటికీ ఇతర పిన్ కోడ్ లు ఉన్న డివిజన్లకు కేటాయించారని దీనివల్ల ప్రజలకు గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందన్నారు.. ఈ అంశం పైన జిహెచ్ఎంసి ప్రధాన కమిషనర్ ని కూడా కలిసి అభిప్రాయాలను చెప్పి గతంలో జగద్గిరిగుట్ట లో ఉన్నటువంటి మక్దుమ్ నగర్ లోని అన్ని బస్తీలను కలిసి ఉండేలా చూసి డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతామని అన్నారు. గాజులరామారం డివిజన్ కి దూరంగా ఉన్నటువంటి మిథిలా నగర్ ను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శి ఎం సహదేవరెడ్డి, సీనియర్ నాయకులు సుంకిరెడ్డి, వంశీ లు పాల్గొన్నారు.



## ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

**- కరిమికొండ స్వప్న అశోక్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజలు ఓటు వేసి ఆశీర్వదిస్తే.. గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కొయ్యలగూడెం గ్రామ బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన బీజేపీ సర్పంచ్ అభ్యర్థి కరిమికొండ స్వప్న అశోక్ అన్నారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వీధులన్నీ కలియ తిరిగారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలు, వృద్ధులు, యువతను ఆత్మీయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఉంగరం గుర్తుకు వేటు ఓటు వేయాలంటూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరిమికొండ స్వప్న అశోక్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల కాలంలో గ్రామం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. గత సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించడంతో, అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. గ్రామ అభివృద్ధి ధ్యేయంగా సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగానన్నారు. తనకు అవకాశం కల్పిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. గ్రామంలో అవసరమైన చోట్ల సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తానన్నారు. అభివృద్ధి ధ్యేయంగా శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

## రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని కలిసిన మాజీ ఎమ్మెల్యే కూన



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : హైదరాబాద్ నగరంలోని ఐటీ శాఖ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ గురువారం తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం యొక్క సమస్యలు , కొత్తగా ఏర్పటైనా డివిజన్ లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్,యువజన నాయకుడు బుచ్చి రెడ్డి, బాచుపల్లి మాజీ సర్పంచ్ ఆగం పాండు,నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ విమర్శలపై భాజపా దీటుగా కౌంటర్ ఇవ్వాలి

**: ప్రధాని మోదీ**



ఢిల్లీ : ఏపీలో సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. గురువారం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల భాజపా ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు ఆయన మాట్లాడారు. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళుతున్నాయని.. ఇది చాలా మంచి అభివృద్ధి అని మోదీ కితాబిచ్చినట్లు సమాచారం. వైకాపా అధ్యక్షుడు జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు భాజపా కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు.

**తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం!**

“తెలంగాణలో ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదు. మంచి టీమ్ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్యేంటి? రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారు” అని మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

# ఏపీ క్యాబినెట్ భేటీ... కీలక నిర్ణయాలు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో రహదారుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, విద్యా రంగం, జైళ్ల సంస్కరణలకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కేబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా జాతీయ రహదారి 16పై భారీ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తాడేపల్లి వరకు 3.8 కిలోమీటర్ల పొడవున ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎల్ 1 బిడ్ను ఆమోదించారు. ఈ ప్రాజెక్టులో ఇంటర్ఛేంజ్లు, వంతెనలు, అండర్పాస్లు కూడా భాగంగా ఉంటాయి. ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు విలువ రూ.532 కోట్ల 57 లక్షలుగా నిర్ణయించారు. దీనితో పాటు, చిత్తూరు జిల్లా కుప్పంలోని పలార్ నదిపై ఉన్న చెక్డ్యామ్ మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల కోసం సవరించిన పరిపాలనా ఆమోదాన్ని కేబినెట్ మంజూరు చేసింది. గతంలో రూ.10.24 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.15.96 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

*** ఉద్యోగులు, విద్యారంగానికి ప్రాధాన్యం**

ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట కల్పిస్తూ రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 3.64 శాతం చొప్పున డీఏ చెల్లించనున్నారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని 417 పోస్టులను అప్గ్రేడ్ చేశారు. ఇందులో 227 తెలుగు, 91 హిందీ భాషా పండితుల పోస్టులతో పాటు 99 వ్యాయామ ఉపాధ్యాయుల (పీడీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్ల కేడర్కు ఉన్నతీకరించారు.

*** చట్టాలు, బోర్డులపై కీలక నిర్ణయాలు**

బ్రిటిష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేస్తూ జైళ్ల సంస్కరణల దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రూపొందించిన 'మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023'కు అనుగుణంగా 'ది ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్, 2025' ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును త్వరలో శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గంజాయి వంటి నేరాలకు పాల్పడిన ఖైదీలకు సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో సంస్కరణ తీసుకురావడంపై మరింత అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతోపాటు, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు పునర్వ్యవస్థీకరణకు కూడా కేబినెట్ ఆమోదించింది. ఈ బోర్డుకు చైర్మన్తో పాటు నలుగురు సభ్యులను నియమించనున్నారు.



*** విరూపాక్ష ఆర్గానిక్స్కు 100 ఎకరాల భూమి**

పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సాహం అందించే క్రమంలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులకు కేబినెట్ పూర్తి ఆమోదం తెలిపింది. ప్రముఖ సంస్థ విరూపాక్ష ఆర్గానిక్స్కు 100 ఎకరాల భూమి కేటాయించాలని నిర్ణయించింది. అమరావతిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐదు కంపెనీల ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. రిలయన్స్ కన్జ్యూమర్ యూనిట్ ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా తీర్మానించింది. రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గవర్నర్ బంగ్లా, దర్బార్ హాల్, గెస్ట్హౌస్ల నిర్మాణానికి సంబంధించిన బిడ్డింగ్ ప్రక్రియకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని రాజధాని నిర్మాణంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# సర్పంచి ఎన్నిక .. మరణించినా.. విజయం వరించెను!

వేములవాడ గ్రామీణం: పంచాయతీ ఎన్నికల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం చింతలఠాణా పంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన చెర్ల మురళి (50) గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గతంలో వార్డు సభ్యుడిగా గ్రామస్తులకు సేవలు అందించాడు. ఈ సారి సర్పంచ్ స్థానం ఎస్సీ జనరల్‌కి రిజర్వు కావడంతో భారత రాష్ట్ర సమితి పార్టీ, ప్రజల మద్దతుతో సర్పంచి స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. తన మద్దతుదారులతో రోజూ ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నాడు. ఈ నెల 4న



అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఎన్నికల నిబంధనల ప్రకారం.. మిగతా ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉండడంతో అధికారులు ఎన్నిక నిర్వహించారు. అయితే.. ప్రజలు మురళిపై ఉన్న అభిమానంతో 358 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించుకున్నారు. గెలిచిన అభ్యర్థి భౌతికంగా లేకపోవడంతో తాత్కాలికంగా ఎన్నిక ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. ఏం జరుగుతుందో అని గ్రామస్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మళ్లీ ఎన్నిక నిర్వహిస్తారా? లేక ఉపసర్పంచి అభ్యర్థికి సర్పంచ్ పదవిని ఇస్తారా? అని చర్చించుకుంటున్నారు.

### తెలంగాణలో బీసీ బిల్లుపై

## కేంద్రం స్పందించాలి: ఎంపీ చామల



దిల్లీ: తెలంగాణ ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని బీసీ బిల్లుకు మద్దతు తెలపాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. లోక్‌సభ జీరో అవర్‌లో.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. ''తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గం, అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం బీసీ బిల్లును ఆరు నెలల క్రితమే గవర్నర్ వద్దకు పంపినా.. ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదు. ఓబీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఉన్నారు.. వెంటనే జోక్యం చేసుకుని బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించాలని కోరుతున్నా'' అని ఎంపీ చామల తెలిపారు.

## సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనం

**: మహేశ్‌గౌడ్**

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందన్నారు. మొదటి విడత ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలుపొందడం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, పార్టీ



తరపున ఎన్నికల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. నిరంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేసిన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేశ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగేందుకు కారణమైందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతం అని వ్యాఖ్యానించారు. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని.. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.



### 95 ఏళ్ల వయసులో.. సర్పంచిగా గెలిచిన

## మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తండ్రి

నాగారం: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించారు. సూర్యాపేట జిల్లా నాగారం సర్పంచి అభ్యర్థిగా భారత రాష్ట్ర సమితి మద్దతుతో బరిలో నిలిచారు. 95 ఏళ్ల వయసులోనూ సమాజసేవకు సిద్ధమంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శేష జీవితం గ్రామాభివృద్ధికి అంకితం చేయాలనేదే తన ఆకాంక్ష అని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గతంలో గ్రామానికి తన కుటుంబం చేసిన సేవలను గుర్తుచేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఇవాళ వెలువడిన ఫలితాల్లో రామచంద్రారెడ్డి విజయం సాధించారు.

## అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పేరిట 'సైబర్' వల.. జాగ్రత్త!

బ్యాంకులు, నియంత్రణ సంస్థల వద్ద ఎవరూ క్లెయిమ్ చేయకుండా పేరుకుపోయిన డిపాజిట్లపై సైబర్ క్రిమినల్స్ కన్నుపడింది. ఈ డిపాజిట్ల కోసం ఆర్‌బీఐ తీసుకొచ్చిన ఉద్గామ్ పోర్టల్‌ని సైబర్ కేటుగాళ్లు ఆసరా చేసుకొంటున్నారు. డబ్బులు ఇప్పిస్తామంటూ నకిలీ లింకులు పంపి ఖాతాలను ఖాళీ



చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించి అధికారిక వెబ్‌సైట్ https://udgam.rbi.org.in మాత్రమే వాడాలని సూచించారు. ఆర్‌బీఐ/బ్యాంకుల పేరుతో వచ్చే సందేశాల్లోని లింకులను నమ్మొద్దని కోరారు. ఆర్‌బీఐ ఎప్పుడూ ఓటీపీలు, పాస్‌వర్డ్‌లను అడగదన్న ఆయన.. వాటిని ఎవరితోనూ షేర్ చేయొద్దని కోరారు. ఏదైనా అనుమానం వస్తే నేరుగా బ్యాంకు శాఖను సంప్రదించాలని సూచించారు. ఒకవేళ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయడం లేదా http://cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..
## సిట్ ఎదుట ప్రభాకర్‌రావు లొంగిపోవాలి: సుప్రీంకోర్టు

దిల్లీ: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పీఎస్‌లో సిట్ అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. కస్టోడియల్ దర్యాప్తునకు సిట్‌కు అనుమతిచ్చిన ధర్మాసనం.. ప్రభాకర్‌రావుకు భౌతికంగా ఎలాంటి హాని లేకుండా చూడాలని స్పష్టం చేసింది. పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తూ విచారణకు సహకరించాలని కోర్టు చెప్పినా.. ఆయన దర్యాప్తునకు సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ధర్మాసనం దృష్టికి తెచ్చారు.



ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌లను రీసెట్ చేసి అందులోని వివరాలను దర్యాప్తు అధికారులకు చూపించాలని కోర్టు ఆయనకు చెప్పినప్పటికీ కేవలం రెండు పాస్‌వర్డ్‌లను మాత్రమే రీసెట్ చేశారని.. రీసెట్ చేసిన రెండు అకౌంట్లలోని సమాచారాన్ని ముందే డిలీట్ చేశారని చెప్పారు. జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ.. 'కోర్టు పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పించడం వల్ల దర్యాప్తునకు సహకరించట్లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీనిపై మీరేమంటారు' అని ప్రభాకర్‌రావు తరపున న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ప్రశ్నించారు. పిటిషనర్ దర్యాప్తునకు సహకరిస్తున్న విషయాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసినట్లు ఆయన చెప్పారు. ఆ అఫిడవిట్‌ను మంగళవారం సాయంత్రం 4 గంటలకు దాఖలు చేయడంతో పరిశీలించలేదని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బుధవారం జరిగిన విచారణ సందర్భంగా చెప్పారు. ఇరువైపులా వాదనల అనంతరం సిట్ అధికారి ఎదుట ప్రభాకర్‌రావు లొంగిపోవాలని ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది.

### మంత్రి కొండా సురేఖపై

## నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

హైదరాబాద్: రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తనపై మంత్రి సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువునష్టం కేసు వేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో విచారణకు హాజరుకాకపోవడంతో నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది.






### వోక్సెన్ యూనివర్సిటీని

## సందర్శించిన సీఎం రేవంత్

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట కంకోల్‌లోని వోక్సెన్ యూనివర్సిటీ ని సందర్శించారు. మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆయన యూనివర్సిటీలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ విభాగాలకు ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శించారు. వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీని పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెంట వోక్సెన్ వ్యవస్థాపకుడు, చాన్సలర్ ప్రవీణ్ కె పూలతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారు.

## యువ ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణలో హైడ్రా కమిషనర్

'బాధ్యతాయుతమైన పౌరులతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుంది.. ఎవరికి వారు మనకెందుకు అనుకోకుండా.. తనవంతుగా సమాజ హితం కోసం కాస్త ఆలోచించాలి' అని హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ సూచించారు. మరీ ముఖ్యంగా యువత ఈ విషయమై దృష్టి పెట్టాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తనను తాను రక్షించుకోవడమే కాకుండా.. తోటి వారితో పాటు.. చుట్టుపక్కల వారిని సురక్షితంగా కాపాడేందుకు ఉద్దేశించిన 'యువ ఆపద మిత్ర' పథకం వాలంటీర్లకు గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్లాటినం జూబ్లీ హాల్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ మాట్లాడారు. ఎన్‌డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ) ప్రారంభించిన 'యువ ఆపద మిత్ర' పథకంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు భాగస్వామ్యం అవ్వడం ఎంతో శుభపరిణామమని అన్నారు. తోటివారిని కాపాడేందుకు తీసుకుంటున్న శిక్షణలో భాగమైనందుకు అందరినీ కమిషనర్ అభినందించారు. పరిసరాల పట్ల అవగాహన ఉన్నప్పుడే వరదలు, అగ్ని ప్రమాదాలు.. ఇలా ఆపద సమయంలో తోటివారిని కాపాడగలమన్నారు. ప్రాణ, ఆస్తి నష్ట నివారణలో భాగస్వామ్యం అవుతున్నందుకు మీరెంతో గర్వపడాలన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణ హైడ్రా అందిస్తుందని చెప్పారు. ఇలా కమ్యూనిటీ ఆధారిత మొదటి ప్రతిస్పందనదారుల నెట్‌వర్క్‌ను రూపొందించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని అన్నారు.

**సమస్యను అర్థం చేసుకోవాలి..**

యువ ఆపద మిత్ర శిక్షణ పొందిన వారు ఎంత వేగంగా స్పందిస్తే.. ప్రమాద తీవ్రతను అంతమేర తగ్గించవచ్చునని హైడ్రా కమిషనర్ చెప్పారు. సమస్యను అర్థం చేసుకోవడంతో పాటు..వాటి పరిష్కారానికి మార్గాలను కూడా సూచించే స్థాయిలో యువత ఉండాలన్నారు. యూనిఫామ్ లేని ఫైర్‌మ్యాన్, పోలీసు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సుగా మీరు పని చేస్తారన్నారు. కెరీర్ పరంగా మీకు మీరు నిచ్చెనలేసుకుని ఎదగడంతో పాటు.. సమాజ సేవ అనే కోణాన్ని కూడా నిత్యం మీలో రగిలేలా యువత తోటివారికి మార్గదర్శకులుగా ఉండాలన్నారు. వాతావరణ కాలుష్యంతో భారీ వర్షాలు నమోదౌతున్నాయని.. ఇలాంటి తరుణంలో యువ వాలంటీర్లు వివిధ శాఖలతో సమన్వయంగా పని చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాలపై పలువురు విద్యార్థుల సందేహాలను హైడ్రా కమిషనర్ ఏవీ.



రంగనాథ్ నివృత్తి చేశారు. ఇదే సమయంలో వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. మాతో పాటు.. భవిష్యత్ తరాలకోసం ప్రకృతి వనరులను కాపాడుతున్నారని పలువురు విద్యార్థులు చెప్పారు. చెరువులను పరిరక్షించి వరదల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను విద్యార్థులు అభినందించారు. కబ్జాదారులు ఎంతటివారైనా వదిలిపెట్టకుండా పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడం అభినందనీయమన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (ఆర్సీయూఈఎస్) డైరెక్టర్ ప్రొ. శ్రీనగేష్, యువ ఆపద మిత్ర స్టేట్ నోడల్ ఆఫీసర్ గౌతమ్ కృష్ణ తదితరులు యువ ఆపద మిత్ర వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు.

# మీ కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండండి: మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ గురువారం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా మహిళలను ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో పేర్లు తొలగింపునకు గురైతే కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యలు చేశారు. ''ఎస్ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారా..? ఎన్నికల సమయంలో దిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మిమ్మల్ని బెదిరిస్తారు. జాబితాలో మీ పేరు లేకపోతే..మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయికదా..! వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారివెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో భాజపా డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుంది. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటివారు ఏనాడు ప్రజలను విభజించేలా వ్యవహరించలేదు. మరి మీరంతా ఎవరు..? భారత స్వాతంత్ర్యం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారు. ఇప్పుడు భారత పౌరులుగా నిరూపించుకోవాలి'' అని కృష్ణానగర్ ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి



మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో భాజపా ఎంపీలకు ఇటీవల ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు.



## 3 కోట్ల IRCTC ఖాతాలపై కేంద్రం కొరడా

తత్కాల్ టికెట్ల జారీ విషయంలో ఇటీవల అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఐఆర్‌సీటీసీ ఖాతాల ఏరివేతనూ అదే స్థాయిలో చేపట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 3.02 కోట్ల అనుమానాస్పద యూజర్ ఐడీలను డీయాక్టివేట్ చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. AKAMAI వంటి యాంటీ బాట్ టెక్నాలజీని వినియోగించి నకిలీ, ఆటోమేటెడ్ ప్రయత్నాలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో ఆయన ఓ ప్రశ్నకు ఆయన గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సామాన్యులకు సాధారణ, తత్కాల్ టికెట్లు అందేలా రిజర్వేషన్ వ్యవస్థ తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. తత్కాల్ వ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఆధార్ బేస్డ్ ఓటీపీ వ్యవస్థను దశలవారీగా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం 322 రైళ్లకు దీన్ని వర్తింపజేశామన్నారు. దీని ద్వారా ఆయా రైళ్లలో తత్కాల్ టికెట్ల అందుబాటు సమయం దాదాపు 65 శాతం మేర పెరిగిందని చెప్పారు. అలాగే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తత్కాల్ బుకింగ్స్‌కు ఓటీపీ వెరిఫికేషన్ విధానాన్ని డిసెంబర్ 4 వరకు 211 రైళ్లకు వర్తింపజేసినట్లు తెలిపారు. దీనివల్ల 96 పాపులర్ ట్రైన్ల టికెట్ల అందుబాటు సమయం 95 శాతం మేర పెరిగిందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

## అమిత్ షా ఆందోళనగా కనిపించారు: రాహుల్ గాంధీ



కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న కంగారుగా కనిపించారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదని విమర్శించారు. ఎన్నికల సంస్కరణలపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆ ప్రసంగాన్ని ఉద్దేశించే గురువారం రాహుల్ మీడియాతో మాట్లాడారు. ''నిన్న అమిత్‌షాజీ ఆందోళనగా కనిపించారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకు కూడా నేరుగా సమాధానం చెప్పలేదు. అలాగే వేటికీ ఆధారం చూపించలేదు. మీడియా ముందు నేను చేసిన వ్యాఖ్యలన్నింటిని పార్లమెంట్‌లో చర్చిద్దామని ఆయనకు సవాలు విసిరాను. కానీ ఆయన నుంచి ఎలాంటి సమాధానం రాలేదు'' అని రాహుల్ అన్నారు. బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా 90 నిమిషాల పాటు మాట్లాడారు. విపక్షనేత రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణల్ని తోసిపుచ్చారు. ఓటు చోరీకి పాల్పడిన పార్టీ కాంగ్రెస్ అని, ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమికి కారణం నాయకత్వ లోపమేనని దుయ్యబట్టారు. చరిత్ర గురించి తాము మాట్లాడితే కాంగ్రెస్‌కి కోపం వచ్చేస్తుందని, చరిత్రే లేకుండా ఏ సమాజమైనా ఎలా ముందుకువెళ్తుందని ప్రశ్నించారు.

*** రాహుల్ హిట్ అండ్ రన్ ఫార్ములా..**

పార్లమెంట్‌లో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతున్నప్పుడల్లా రాహుల్ బయటకు వెళ్లిపోతారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. రాహుల్ గాంధీ హిట్ అండ్ రన్ ఫార్ములాను అనుసరిస్తున్నారని, ఇదేనా ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యమంటే..? అని ప్రశ్నించారు. భవిష్యత్తులో అయినా ఆయన ఆ అలవాటును మానేస్తారని అనుకుంటున్నానని చెప్పారు.

## పలు రాష్ట్రాల్లో
## ఎస్ఐఆర్ గడువును పొడిగించిన ఈసీ




తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఎన్నికల సంఘం తాజా అప్‌డేట్ ఇచ్చింది. వీటిలో తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ సహా అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ గడువును పొడిగించింది. పశ్చిమబెంగాల్, రాజస్థాన్, లక్షద్వీప్, గోవాల్లో మాత్రం ఈ గడువు నేటితో ముగిసింది. తమిళనాడు, గుజరాత్‌లలో డిసెంబర్ 14వరకు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులకు డిసెంబర్ 18వరకు, ఉత్తర్ ప్రదేశ్‌లో డిసెంబర్ 26 వరకు గడువు పెంచుతున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. వీటికి అనుగుణంగా సవరణ జాబితా ప్రచురణ తేదీలు కూడా మార్చినట్లు తెలిపింది.

## గోవా నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాద ఘటన..
## థాయ్‌లాండ్‌లో యజమానులు అదుపులోకి



గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదంపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితులు, క్లబ్ యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను థాయ్‌లాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి అధికారులు వారిని అదుపులోకి తీసుకున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈనెల 6న రాత్రి 11.45 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకోగా.. నిందితులిద్దరూ 7న ఉదయం 5.30 గంటలకు ఓ విమానంలో థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పారిపోయినట్లు ముంబయిలోని 'బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్' గుర్తించినట్లు ఇప్పటికే పోలీసులు తెలిపారు. వారి పాస్‌పోర్టులు సస్పెండ్ అయిన నేపథ్యంలో ఆ దేశంలో ఉండటం చట్టవిరుద్ధం. దాంతో అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని 24 గంటల్లో భారత్‌కు తరలించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా.. గోవాలోని 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 25 మంది మృతి చెందారు. సిలిండర్ పేలుడుకు బాణసంచా తోడు కావడంతో తీవ్రత పెరిగింది.

## అఫ్గాన్‌పై పాక్ దాడులను ఖండిస్తున్నాం: భారత్



అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడటాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. చిన్నారులు, మహిళలు, క్రికెటర్లపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన చర్చలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఐక్యరాజ్య సమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుంది. అమాయకులైన పౌరుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం సరికాదు. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న అఫ్గాన్‌పై బహిరంగ బెదిరింపులు, యుద్ధచర్యలు వంటివి అంతర్జాతీయ చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమే. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను తాము సమర్థిస్తున్నామని ఉద్ఘాటించారు. అక్కడి భద్రతా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా, లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర సంస్థలు సరిహద్దు ఉగ్రవాదంలో పాల్గొనకుండా చేయాలని పిలుపునిచ్చారు. అఫ్గాన్ ప్రభుత్వంతో సంబంధాలు పెంచుకోవడంపై భారత వైఖరిని ఉద్ఘాటించారు.

## జన్మనివ్వడం కోసం అమెరికాకు!..
## ఆ దరఖాస్తులు తిరస్కరిస్తాం - అమెరికా ఎంబసీ




అమెరికా వలస విధానాన్ని కఠినతరం చేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. ఇతర వీసాలతోపాటు పర్యటక వీసా జారీ విషయంలోనూ అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ క్రమంలో పుట్టబోయే చిన్నారికి పౌరసత్వం అనేది అమెరికా పర్యటన ఉద్దేశమని తాము భావిస్తే.. అటువంటి దరఖాస్తులను తిరస్కరిస్తామని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో అలర్ట్ జారీ చేసింది. ''పుట్టబోయే చిన్నారులకు అమెరికా పౌరసత్వం పొందడం పర్యాటకుల ప్రధాన ఉద్దేశంగా తాము భావిస్తే.. అటువంటి వారి వీసా దరఖాస్తులను తిరస్కరిస్తాం. ఇటువంటి వాటిని అనుమతించం'' అని అమెరికా రాయబార కార్యాలయం పేర్కొంది. మరోవైపు తమ దేశంలోకి వచ్చే పర్యాటకుల్లో కొందరు దరఖాస్తు సమయంలో తప్పనిసరిగా తమ సోషల్ మీడియా హిస్టరీని అందించడాన్ని తప్పనిసరి చేసే యోచనలో ట్రంప్ సర్కార్ ఉన్న విషయం తెలిసిందే.

## పాక్ మాజీ ఐఎస్ఐ చీఫ్‌కు 14 ఏళ్ల జైలుశిక్ష

పాకిస్థాన్ గూఢచార సంస్థ మాజీ చీఫ్ ఫైజ్ హమీద్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ ఉల్లంఘన, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం వంటి తదితర అభియోగాల్లో ఆయన దోషిగా తేలాడు. వీటికి సంబంధించి పాక్‌లోని ఓ మిలటరీ కోర్టు మాజీ చీఫ్‌కు 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. పాక్‌లో ఓ ఐఎస్ఐ మాజీ చీఫ్ స్థాయి అధికారి దోషిగా తేలడం, శిక్ష పడటం ఇదే తొలిసారి. పాకిస్థాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ISI) డైరెక్టర్ జనరల్‌గా ఫైజ్ హమీద్ 2019 నుంచి 2021 వరకు పనిచేశాడు. ఆర్మీ చీఫ్‌గా ఆసిం మునీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కమాండర్ హోదాలో ఉన్న హమీద్.. డిసెంబర్ 2022లో ముందస్తు పదవీ విరమణ చేశాడు. మునుపటి సైనికాధిపతి జనరల్ కమర్ బజ్వాకు హమీద్ సన్నిహితుడిగా పేరుంది. హమీద్ భూకబ్జాకు పాల్పడడంతోపాటు ఓ ప్రైవేట్ హౌసింగ్ సొసైటీలో సోదాల సమయంలో విలువైన వస్తువులు తస్కరించాడనే ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు టాప్ సిటీ హౌసింగ్ సొసైటీ సీఈవో అక్కడి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## భారత్, చైనాపై మెక్సికో 50% సుంకాలు!



దిగుమతి వస్తువులపై సుంకాలకు సంబంధించి అమెరికా బాటలోనే మెక్సికో వెళ్తున్నట్లు తెలుస్తోంది. తమ దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఎంపిక చేసిన వస్తువులపై సుంకాలను భారీగా పెంచేందుకు మెక్సికో ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు అక్కడి సెనెట్ ఆమోదం తెలిపింది. చైనా, భారత్ సహా పలు ఆసియా దేశాలకు చెందిన దాదాపు 1400 వస్తువులపై సుంకాలు 50 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. వచ్చే జనవరి 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నాయి. చైనా, భారత్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియాతో సహా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని ఇతర ఆసియా దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఆటోమొబైల్స్, విడిభాగాలు, టెక్స్‌టైల్స్, దుస్తులు, ప్లాస్టిక్, స్టీలు తదితర వస్తువులపై సుంకాలు పెంచాలని మెక్సికో ప్రతిపాదించింది. వీటిని అక్కడి ఆర్థికమంత్రి సెప్టెంబర్‌లోనే ప్రవేశపెట్టారు. అయితే, చట్టసభలో అధికార మోరెనా పార్టీకి మెజార్టీ ఉన్నప్పటికీ అప్పుడు సభ మద్దతు పొందలేకపోయింది. తాజాగా ఇందుకు గ్రీన్ సిగ్నల్ లభించడంపై అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ స్పందించారు. దేశీయ ఉత్పత్తి పెంచడం, చైనాతో వాణిజ్య సమతుల్యత సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు క్లాడియా తెలిపారు. అయితే, అమెరికా మెక్సికోకెనడా వాణిజ్య ఒప్పందం తదుపరి సమీక్షకు ముందే ఈ చర్యలు తీసుకోవడం ఆసక్తిగా మారింది. మెక్సికోను ఉపయోగించుకొని చైనా బ్యాక్‌డోర్‌లో అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశిస్తుందని ట్రంప్ యంత్రాంగం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికాను బుజ్జగించేందుకే క్లాడియా ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించిందని విశ్లేషకులు, ప్రైవేటు రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# అమెరికా బాటలోనే మెక్సికో..

## భారత్‌పై 50 శాతానికి సుంకాలు పెంపు



**న్యూఢిల్లీ:** భారత్‌పై అమెరికా భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ట్రంప్ నిర్ణయంతో భారత్-అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇక ఇప్పుడు తాజాగా అమెరికా బాటలోనే మరో దేశం కూడా ఇండియాకి షాకిచ్చింది. భారత్ సహా పలు దక్షిణాసియా దేశాలపై సుంకాలు విధించేందుకు మెక్సికో సిద్ధమైంది.

భారత్, చైనా, దక్షిణ కొరియా వంటి పలు దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే దిగుమతులపై భారీగా సుంకాల్ని పెంచే బిల్లుకు మెక్సికన్ సెనెట్ బుధవారం ఆమోదం తెలిపింది. కనీసం 5 శాతం నుంచి 50 శాతం వరకు దిగుమతి సుంకాల్ని పెంచే బిల్లుకు మెక్సికో సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు 76 మంది అనుకూలంగా, 5 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కొత్త సుంకాలు వచ్చే ఏడాది నుంచే అమల్లోకి రానున్నాయి. దుస్తులు, లోహాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉక్కు సహా అనేక ఉత్పత్తులపై వీటి ప్రభావం పడనుంది. ఈ నిర్ణయంతో దక్షిణాసియా దేశాలపై మెక్సికో వాణిజ్య యుద్ధం ప్రకటించినట్లైంది. ఈ సుంకాలు దేశీయ తయారీని పెంచేందుకు, ముఖ్యంగా చైనాతో పెరుగుతున్న వాణిజ్య అసమతుల్యతలను పరిష్కరించడానికి ఉద్దేశించినవిగా క్లాడియా ప్రభుత్వం చెబుతోంది.

# 2 కోట్ల మంది భారతీయులకు

## ఏఐపై నైపుణ్య శిక్షణ ఇస్తాం: సత్యా నాదెళ్ల




**బెంగుళూరు:** మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల గురువారం బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన తెలిపారు. క్లౌడ్ కంప్యూటింగ్ వ్యవస్థను కూడా మైక్రోసాఫ్ట్ మరింత పటిష్టం చేసేందుకు పనిచేస్తున్నట్లు చెప్పారు. లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఉత్తమైన మౌళిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు చెప్పారు.

సుమారు 17.5 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్లు సత్యానాదెళ్ల తెలిపారు. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్‌కు చెందిన అత్యంత భారీ పెట్టుబడి ఇదేనని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్లౌడ్ ఫ్లాట్‌ఫామ్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్ తెలిపారు. అజూర్ కంప్యూటర్ వ్యవస్థపై వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 70 కన్నా ఎక్కువ సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయన్నారు. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్ సెంటర్లు పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. గిట్‌హబ్ లో 2030 నాటికి ఇండియా నెంబర్ వన్‌గా మారుతుందని ఆయన అంచనా వేశారు.

భారత్‌లో జియోతోనూ భాగస్వామ్యం ఉందన్నారు. 2026లో కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్‌గా మారనున్నట్లు నాదెళ్ల చెప్పారు. దక్షిణమధ్య భారతంలో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోనున్నట్లు నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సుమారు రెండు కోట్ల మంది భారతీయులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నాదెళ్ల తెలిపారు. ప్రభుత్వానికి చెందిన ఈ-శ్రమ్ ప్రోగ్రామ్ ద్వారా అసంఘటిత కార్మికులను ఏఐతో చైతన్యపరచవచ్చు అన్నారు. భారత్‌లోని ప్రతి వ్యక్తిని, ప్రతి సంస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నాదెళ్ల పేర్కొన్నారు.

# ఫెడ్ నిర్ణయంతో పరుగులు పెట్టిన మార్కెట్లు...

**మూడు రోజుల నష్టాలకు బ్రేక్!**

**అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో పెరిగిన సెంటిమెంట్**

**426 పాయింట్ల లాభంతో 84,818 వద్ద ముగిసిన సెన్సెక్స్**

**140 పాయింట్లు పెరిగి 25,898 వద్ద స్థిరపడిన నిఫ్టీ**

**మెటల్, ఆటో షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. మూడు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు అడ్డుకట్ట పడింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో అన్ని రంగాల్లో కొనుగోళ్ల జోరు కనిపించింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 426.86 పాయింట్లు లాభపడి 84,818.13 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 140.55 పాయింట్లు పెరిగి 25,898.55 వద్ద ముగిసింది. అమెరికాలో అధిక ద్రవ్యోల్బణం నేపథ్యంలో ఫెడ్ ఊహించినట్టుగానే రేట్ల కోతకు మొగ్గు చూపడం మార్కెట్లకు కలిసొచ్చింది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ తగ్గడంతో విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ఆందోళనలు తగ్గాయని విశ్లేషకులు తెలిపారు.

సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ ఇండియా, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా 2.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్ షేర్లు నష్టాలతో ముగిశాయి.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్, ఆటో సూచీలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాల్లోనూ కొనుగోళ్లు కనిపించాయి. అయితే నిఫ్టీ మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు స్వల్ప నష్టాలను చవిచూశాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి.

# రెండో టీ20లో టీమిండియా ఓటమి...

**తిలక్ వర్మ ఒంటరిపోరు వృథా**

**రెండో టీ20లో భారత్‌పై 51 పరుగుల తేడాతో గెలిచిన దక్షిణాఫ్రికా**

**విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగిన క్వింటన్ డికాక్ (90)**

**ఒంటరి పోరాటం చేసిన తిలక్ వర్మ (62)**

**నాలుగు వికెట్లతో టీమిండియాను దెబ్బతీసిన ఒట్నీల్ బార్ట్‌మన్**

**భారీ లక్ష్య ఛేదనలో విఫలమైన భారత టాప్ ఆర్డర్**




**ముల్లన్ పూర్:** సఫారీలతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ ఓటమిపాలైంది. ముల్లన్ పూర్‌లో దక్షిణాఫ్రికా అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 51 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. క్వింటన్ డికాక్ (90) మెరుపు ఇన్నింగ్స్‌కు, ఒట్నీల్ బార్ట్‌మన్ (4/24) అద్భుత బౌలింగ్ తోడవడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. తిలక్ వర్మ (62) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. 214 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుభ్‌మన్ గిల్ (0) తొలి బంతికే వెనుదిరగ్గా, అభిషేక్ శర్మ (17), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. దీంతో 32 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన యువ బ్యాటర్ తిలక్ వర్మ (34 బంతుల్లో 62బీ 2 ఫోర్లు, 5 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. హార్దిక్ పాండ్య (20), జితేష్ శర్మ (27)తో కలిసి భాగస్వామ్యాలు నిర్మించాడు. అయితే, టీమిండియా బ్యాటర్లు పెరిగిన రన్‌రేట్ ఒత్తిడిని తట్టుకోలేకపోయారు.

ఒకవైపు తిలక్ వర్మ పోరాడుతున్నా, మరోవైపు వికెట్లు పడుతూనే ఉన్నాయి. దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసి భారత బ్యాటర్లను కట్టడి చేశారు. ముఖ్యంగా ఒట్నీల్ బార్ట్‌మన్ నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత పతనాన్ని శాసించాడు. అతనికి మార్కో యాన్సెన్, లుంగి ఎంగిడి, సిపామ్లా తలో రెండు వికెట్లతో చక్కటి సహకారం అందించారు. ఫలితంగా భారత జట్టు 19.1 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయి ఓటమిని అంగీకరించింది.

అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణయం తప్పని దక్షిణాఫ్రికా బ్యాటర్లు నిరూపించారు. ఓపెనర్ క్వింటన్ డికాక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 46 బంతుల్లో 5 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 90 పరుగులు చేసి భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. కెప్టెన్ మార్‌క్రమ్ (29)తో కలిసి రెండో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు.

చివర్లో డొనోవాన్ ఫెరీరా (16 బంతుల్లో 30), డేవిడ్ మిల్లర్ (12 బంతుల్లో 20) మెరుపులు మెరిపించడంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీ స్కోరు చేసింది. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (2/29) ఒక్కడే కాస్త పొదుపుగా బౌలింగ్ చేయగా, అర్ష్‌దీప్ సింగ్ (54), జస్‌ప్రీత్ బుమ్రా (45) భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

కాగా, ఈ విజయంతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ను దక్షిణాఫ్రికా 1-1తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 మ్యాచ్ డిసెంబరు 14న ధర్మశాలలో జరగనుంది.

## మహిళా క్రికెటర్లకు గుడ్‌న్యూస్..

# మ్యాచ్ ఫీజులు పెంచేస్తున్న బీసీసీఐ..!



**న్యూఢిల్లీ:** ఇటీవల కాలంలో మహిళల క్రికెట్ అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. వన్డే ప్రపంచకప్ ఛాంపియన్‌గా అవతరించిన టీమిండియా క్రికెటర్లకు ప్రోత్సాహకంగా మ్యాచ్ ఫీజులను పెంచనుంది. డిసెంబర్ 22 న జరుగనున్న సమావేశంలో మ్యాచ్ ఫీజుల సవరణ అంశం ప్రధానంగా చర్చకు రానుంది.

ఈమధ్యే స్వదేశంలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు తొలిసారి విశ్వవిజేతగా నిలిచింది. మహిళా క్రికెట్ చరిత్రలో తొలి ఐసీసీ ట్రోఫీతో దేశం గర్వపడేలా చేసింది హర్మన్‌కౌర్ బృందం. దాంతో.. దేశవాళీలో మహిళా క్రికెటర్లకు వేతనాలు పెంచాలనే నిర్ణయానికొచ్చింది బీసీసీఐ. ప్రస్తుతం డొమెస్టిక్ మ్యాచ్‌లకు చెల్లిస్తున్న మ్యాచ్ ఫీజుల సవరణపై డిసెంబర్ 22 న వర్చువల్‌గా జరిగే సమావేశంలో బీసీసీఐ ప్రతినిధులు చర్చించనున్నారు.

ఇదే మీటింగ్‌లో భారత పురుషుల జట్టు ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ అంశం కూడా తెరపైకి రానుంది. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గ్రేడ్ మారే అవకాశముంది. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో ఉన్న వీరిని ఏకు మారుస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. అంపైర్లు, మ్యాచ్ రిఫరీల జీతాల పెంపుపై కూడా బీసీసీఐ పెద్దలు నిర్ణయం తీసుకోనున్నారు. అయితే.. పురుషులతో పోల్చితే మహిళా క్రికెటర్లకు దేశవాళీ ఫీజులు తక్కువే ఉండే అవకాశముంది.

**సమావేశం ఎజెండా ఇదే..**

1. బీసీసీఐ సమావేశం 30వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించడం.
2. మహిళా క్రికెటర్లకు దేశవాళీలో మ్యాచ్ ఫీజుల సవరణ.
3. బీసీసీఐ డిజిటల్ ఆస్తులు (వెబ్‌సైట్, డొమైన్స్, యాప్స్, సోషల్‌మీడియా ఖాతాలు) వంటివి అప్డేట్ చేయడం.
4. అంపైర్లు, రిఫరీల మ్యాచ్ ఫీజుల్లో సవరణ.
5. క్రికెటర్ల వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ పునరుద్ధరణ.
6. బీసీసీఐ అధ్యక్షుడు ఒకవేళ ఏదైనా అత్యవసరమైన విషయాన్ని ప్రస్తావిస్తే.. దాన్ని ఎజెండాలో చేర్చే అవకాశముంది.

## రోహిత్, కోహ్లీ

# శాలరీల్లో 2 కోట్ల కోత !

**ముంబై:** వివిధ కేటగిరీల్లోని క్రికెటర్లకు బీసీసీఐ ప్రతి ఏడాది శాలరీ చెల్లిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఏ ప్లస్ జాబితాలో ఉన్న క్రికెటర్లకు అత్యధికంగా ఏడు కోట్ల జీతం ఇస్తారు. సెంట్రల్ కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్ల జాబితాను ఏప్రిల్ 2025లో రిలీజ్ చేస్తారు. ఇక రాబోయే సంవత్సరానికి చెందిన కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితాను కూడా త్వరలో రిలీజ్ చేయనున్నారు. ఏ ప్లస్ కేటగిరీలో జీతం తీసుకుంటున్న ప్రఖ్యాత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై ప్రభావం పడే అవకాశం ఉన్నది. ప్రస్తుతం టెస్టులు, టీ20ల నుంచి ఆ ఇద్దరు మేటి క్రికెటర్లు తప్పుకున్నారు. వాళ్ల కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. దీని వల్ల సెంట్రల్ కాంట్రాక్టులోని కేటగిరీల్లో మార్పు జరిగే అవకాశం ఉన్నది.

బీసీసీఐ నాలుగు కేటగిరీల ప్రకారం క్రికెటర్లకు జీతాలు చెల్లిస్తుంది. అత్యధిక శాలరీలు ఏ ప్లస్ కేటగిరీలో ఉన్న ఆటగాళ్లకు అందుతుంది. ఇక ఆ తర్వాత స్థానాల్లో ఏ, బీ, సీ కేటగిరీ క్రికెటర్లు ఉంటారు. ప్రస్తుతం కోహ్లీ, రోహిత్ శర్మ ఏ ప్లస్ కేటగిరీలో ఉన్నారు. కానీ ఇటీవల వాళ్లు టెస్టు, టీ20లకు దూరం కావడం వల్ల .. ఆ క్రికెటర్ల గ్రేడింగ్ తగ్గే అవకాశం ఉన్నది. ఏ ప్లస్ కేటగిరీ నుంచి ఆ ఇద్దరూ ఏ కేటగిరీలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నాయి. ఆ డిమోషన్ వల్ల వాళ్ల శాలరీల్లో ఒక్కొక్కరికి రెండు కోట్ల కోత పడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. కాంట్రాక్టులో ఉన్న ప్లేయర్లకు.. మ్యాచ్‌ల సంఖ్యతో సంబంధం లేకుండా పేమెంట్ చేస్తారు. అయితే శాలరీకి అదనంగా మ్యాచ్ ఫీజును అందిస్తారు.




ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఇటీవల టీ20 క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. కానీ అతను టెస్టు జట్టులో ఉన్నాడు. దీంతో అతను ఏ ప్లస్ కేటగిరీలోనే కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఏ ప్లస్ కాంట్రాక్టు జాబితా ప్లేయర్లకు ఏడు కోట్లు శాలరీ ఇవ్వగా, ఏ కేటగిరీ ఆటగాళ్లకు 5 కోట్లు మాత్రమే ఇస్తారు.

# భారత జెర్సీ ధరిస్తే అన్నీ మర్చిపోతా..

**క్రికెట్టే నా ప్రాణం: స్మృతి మంధాన**

**శ్రీలంకతో టీ20 సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన**

**పెళ్లి రద్దయిన తర్వాత తొలిసారి మీడియా ముందుకు**

**క్రికెట్‌ను మించి ప్రేమించేది ఏదీ లేదన్న స్టార్ బ్యాటర్**

**వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి ఆటపైనే పూర్తి దృష్టి అని వెల్లడి**



**న్యూఢిల్లీ:** భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వ్యక్తిగత జీవితంలోని కష్టకాలం నుంచి బయటపడి, తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. శ్రీలంకతో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు ఆమె భారత జట్టు వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. కాగా, సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్‌తో తన వివాహం రద్దయిన తర్వాత తొలిసారి ఆమె బుధవారం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంధాన మాట్లాడుతూ.. "నా జీవితంలో క్రికెట్‌ను మించి నేను దేనినీ ఎక్కువగా ప్రేమించను. భారత జట్టు జెర్సీ ధరించి దేశం కోసం ఆడుతున్నప్పుడు ఇతర ఆలోచనలు ఏవీ మనసులోకి రావు. ఆ జెర్సీ ధరించడమే అతిపెద్ద ప్రేరణ. మనకున్న సమస్యలన్నీ పక్కనపెట్టి, దేశం కోసం గెలవాలనే బాధ్యత మాత్రమే గుర్తుంటుంది" అని ఆమె తన భావాలను పంచుకున్నారు.

జట్టులో విభేదాలపై అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ, "జట్టులో జరిగే చర్చలు లేదా వాదనలను నేను సమస్యలుగా చూడను. దేశాన్ని గెలిపించాలనే తపన అందరిలోనూ ఉంటుంది. ఆ క్రమంలో భిన్నాభిప్రాయాలు రావడం సహజం. నిజానికి అలాంటి చర్చలు జరగకపోతే, మనం గెలవాలనేంత పట్టుదలతో లేనట్టే లెక్క" అని ఆమె వివరించారు.

నవంబర్ 23న పలాశ్ ముచ్చల్‌తో స్మృతి మంధాన వివాహం జరగాల్సి ఉండగా, ఆమె తండ్రి అనారోగ్యంతో వాయిదా పడింది. ఆ తర్వాత ఈ నెల 7న తాము పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్లు ఇద్దరూ సోషల్ మీడియా ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల తర్వాత మంధాన తిరిగి క్రికెట్‌పై పూర్తి దృష్టి సారించింది.

# అఖండ-2 నుంచి శివశివ సాంగ్ విడుదల

## నేడు థియేటర్లలలో విడుదలకు సిద్ధం

## శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న బోయపాటి

**టాకీస్:** మరికొన్ని గంటల్లో 'అఖండ 2'తో థియేటర్‌లలో సందడి చేసేందుకు బాలకృష్ణ సిద్ధమయ్యారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 12న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో చిత్రబృందం ప్రచారం జోరు పెంచింది. తాజాగా ఇందులోని 'శివ శివ..' అంటూ సాగే ఎమోషనల్ ఆడియో సాంగ్‌ను విడుదల చేసింది. ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి లిరిక్స్ రాయగా.. కనకవ్వ, శ్రుతి రంజనీ ఆలపించారు. ప్రస్తుతం తెలుగు సినీ ప్రేక్షకులంతా ఏ సినిమా కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'అఖండ 2: తాండవం' చిత్రం డిసెంబర్ 5న విడుదల కావలసి ఉన్నా పలు కారణాల వలన వాయిదా పడింది. ఇక ఎట్టకేలకి డిసెంబర్ 12న రిలీజ్ కానుంది. బాలకృష్ణ- బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ఈ సీక్వెల్‌కు అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయనే చెప్పాలి. విడుదల వాయిదా




పడినప్పటికీ సినిమాపై ఉన్న క్రేజ్ మాత్రం రెండింతలు పెరిగింది. తాజాగా తెరుచుకున్న లిమిటెడ్ బుకింగ్స్‌తోనే అఖండ 2 ఏ రేంజ్‌లో ర్యాంపేజ్ చేస్తుందో స్పష్టమైంది. అనకాపల్లి నుంచి అమెరికా వరకు..ఎక్కడ చూసినా బాలయ్య సినిమాకే భారీ డిమాండ్. తెలుగు స్టేట్స్‌లో ఇంకా అన్ని షోలు ఓపెన్ కాకపోయినా, బుక్ మై షోలో లక్షల్లో టికెట్లు అమ్ముడైపోతున్నాయి. ఈ హడావిడి చూస్తుంటే ఆడియెన్స్‌లో ఉన్న మ్యాడ్నెస్ ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది.



MOVIE TIME

# దురంధర్‌పై హృత్రిక్ ప్రశంసలు

**టాకీస్:** ఇటీవల విడుదలైన ధురంధర్ ప్రశంసలు అందుకుంటుంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు ఈ చిత్రంపై రివ్యూ ఇవ్వగా తాజాగా హృతిక్ రోషన్ దీని గురించి మాట్లాడారు. అయితే, ఆయన వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తప్పుపడుతున్నారు. సినిమా చాలా బాగుందన్న హృతిక్ ఇందులో చూపించిన రాజకీయ అంశాలను తాను అంగీకరించనని అన్నారు. నాకు ఈ చిత్రం చాలా నచ్చింది. ఇంత గొప్ప కథను ప్రేక్షకులకు అందించినందుకు చిత్ర బృందానికి అభినందనలు. హృదయానికి హత్తుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. కథను తెరకెక్కించిన విధానం మెప్పించింది. సినిమా అంటే ఇలా ఉండాలి అనిపించింది. ఇందులో చూపించిన రాజకీయపరమైన అంశాలను నేను అంగీకరించలేకపోతున్నా. కానీ, దర్శకులు కొన్ని విషయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి కాబట్టి అలా రూపొందించారని నేను భావిస్తున్నా. నేను ఈ చిత్రాన్ని ఆస్వాదించాను. దీనినుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని హృతిక్ అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ విమర్శలకు దారితీస్తున్నాయి. ధురంధర్‌లో కేవలం పాకిస్థాన్ ఉగ్రవాదుల క్రూరత్వాన్ని చూపారని, వారి భయంకరమైన దాడులను చూపారని ఆ విషయాలను ఎందుకు అంగీకరించ లేక పోతున్నారని నటుడిపై విమర్శలు కురిపిస్తు న్నారు. రణ్‌వీర్ సింగ్, మాధవన్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా మరోవైపు కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ యాక్షన్ థ్రిల్లర్ ఇప్పటివర కూ రూ.180 కోట్లు వసూలు చేసింది. ఈ వారంలో రూ. 200 కోట్లు వసూలు చేయవచ్చని అభిమానులు భావిస్తున్నారు.

# హెబ్బా పటేల్ నుండి బ్యాక్ టు బ్యాక్ మూవీస్



**టాకీస్:** హెబ్బా పటేల్ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి దాదాపు పుష్కర కాలం అవుతున్నా ఇంకా నిలకడ లేని కెరీర్నే కంటిన్యూ చేస్తుంది. కుమారి 21 లాంటి అడల్ట్ కంటెంట్ సబ్జెక్ట్‌తో హెబ్బా హెబ్బా అనిపించుకోగలిగింది కానీ ఈ క్రేజ్ కాపాడుకోవడంలో తడబడింది. పోనీ గ్లామరస్ సీన్స్ చేయదా అంటే అది కాదు అందాల ఆరబోత, లిప్ లాక్స్ వంటి సీన్లకు నో చెప్పదు. అయినా టైర్ వన్ హీరోలతో జోడీ కట్టే ఛాన్సులు రాలేదు. ఓదెల రైల్వే స్టేషన్ లో డీ గ్లామర్ రోల్ చేసినా హెబ్బా ఆ తర్వాత చెప్పుకోదగ్గ సినిమాలు చేయలేదు. ఓదెల2లో నటించినా నో ఇంపార్టెన్స్. ఇక కెరీర్ డైలామాలో పడిపోతున్న టైంలో మరోసారి గ్లామర్‌నే నమ్ముకుంది బ్యూటీ. అది కూడా అడల్ట్ కంటెంట్ మూవీ మారియోతో రాబోతోంది. ఇప్పుడు తనలోని పాత టాలెంట్ బయటకు తీస్తోంది. మరింత గ్లామర్ డోస్ పెంచి మళ్లీ యూత్ అటెన్షన్ గ్రాబ్ చేసేందుకు ప్లాన్ చేస్తుంది హెబ్బా. డిసెంబర్ 19న థియేటర్లలోకి రాబోతోంది మారియో ఫిల్మ్. మారియో కన్నా వారం ముందే థియేటర్లలో హారర్ ఫిల్మ్ ఈషాతో సందడి చేయబోతోంది హెబ్బా. యంగ్ హీరో త్రిగుణ్‌తో కలిసి మరోసారి జోడీ కడుతోంది. 24 కిస్సెస్ అనే చిత్రంలో ఈ ఇద్దరు కలిసి నటించారు. రాజు వెడ్స్ రాంబాయ్ ఫేం అఖిల్ రాజ్, సిరి హన్మంత్ మరో జోడీ. డిసెంబర్ 25న థియేటర్లలోకి రాబోతోంది ఈషా. శ్రీనివాస్ మన్నే దర్శకత్వం వహించగా ప్రముఖ నిర్మాత బన్నీ వాస్, వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. మొత్తానికి అప్ కమింగ్ హీరోలతో జోడీ కట్టి స్టార్ హీరోలకు దూరమైంది హెబ్బా. మరి ఈ సినిమాలైనా ఆమెను గట్టెక్కిస్తాయో లేదో..?

## చిరుతలో రామ్‌చరణ్‌లా ఉన్న

# రోషన్ కనకాల

## మోగ్లీ ప్రీ రిలీజ్ వేడుకల్లో నటుడు రానా కితాబు

**టాకీస్:** రోషన్ కనకాలను చూస్తుంటే తనకు 'చిరుత'లో రామ్ చరణ్‌ను చూసినట్లు ఉందని నటుడు రానా అన్నారు. రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మోగ్లీ 2025'. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. డిసెంబర్ 13న విడుదల కానుంది. తాజాగా ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఆ వేడుకకు రానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదిలావుంటే రానా, విష్ణు విశాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అడవి, ఏనుగుల రక్షణ కోసం పాటుపడే వ్యక్తిగా రానా నటించారు. తాజాగా రానా ఆ సినిమా షూటింగ్ రోజులను గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశంలోకి ఏనుగుల గుంపు వచ్చిందని చెప్పారు. అరణ్య షూటింగ్ కోసం ఆరు నెలలు అడవిలో ఉన్నాం. మేము కొన్ని సన్నివేశాలను ఏనుగులు ఉండే ప్రాంతంలో చేశాం. సాయంత్రం సమయానికి వెళ్లిపోవాలి అన్నారు. అనుకున్న టైమ్‌కు మన షూటింగ్‌లు ఎప్పుడూ ముగించరని అందరికీ తెలిసిందే. దీంతో రాత్రి వరకూ అక్కడే ఉన్నాం. నేను సన్నివేశంలో భాగంగా దూరంగా ఉన్నాను. సడన్‌గా అందరూ గబగబా వెళ్లిపోతున్నారు. ఎందుకు ఇలా పరిగెడుతున్నారు అని చూసేసరికి ఏనుగులు మా వైపునకు వస్తున్నాయి. దీంతో నేను, మరికొంతమంది వాటికి కనిపించకుండా చెట్ల చాటుకు వెళ్లాం. కొంచెం కూడా శబ్దం చేయకుండా అలానే మూడు గంటలు ఉన్నాం. ఆ చిమ్మచీకట్లో అలా మూడు గంటలు ఉండడం ఎప్పటికీ మర్చిపోలేను. అడవి ఎంత భయంకరంగా ఉంటుందో మొదటిసారి అప్పుడే అర్థమైంది అని రానా ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. 'నేనే రాజు.. నేనే మంత్రి'




తర్వాత రానా నటించిన సినిమా 'అరణ్య'. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత విడుదలైన తొలి పాన్ ఇండియా చిత్రం కూడా ఇదే. ఇందులో రానా ఫారెస్ట్ మేన్‌గా నటించారు. సందేశాత్మక చిత్రంగా ఆకట్టుకుంది.

## చిన్మయి మార్ఫింగ్ ఫోటోతో ట్రోల్ గట్టిగా రిప్లై ఇస్తూనే..

# పోలీసులకు ఫిర్యాదు

**టాకీస్:** సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దాడులకు సింగర్ చిన్మయి శ్రీపాద మరోసారి గట్టి సమాధానం ఇచ్చారు. మహిళల హక్కులు, భద్రత వంటి అంశాలపై గళమెత్తే చిన్మయి తరచూ ట్రోలింగ్‌కు గురయ్యే విషయం తెలిసిందే. అయితే ప్రతిసారి ధైర్యంగా స్పందిస్తూ, ట్రోలర్లను ఎదుర్కొనే తీరుతో ఆమె పలుమార్లు ప్రశంసలు పొందారు. తాజాగా ఆమెపై మార్ఫింగ్ ఫోటోలతో దాడి చేసిన వ్యక్తులపై చిన్మయి ఘాటుగా స్పందించి వీడియోను షేర్



చేశారు. చిన్మయి తన మార్ఫింగ్ చేసిన ఫోటోను, దాన్ని షేర్ చేసిన అకౌంట్ స్క్రీన్‌షాట్‌ను పోస్ట్ చేస్తూ, వెంటనే పోలీసులకు కంప్లయింట్ చేసినట్లు తెలిపారు. గత 8-10 వారాలుగా కొంతమంది డబ్బులు తీసుకుని తనను, తన కుటుంబాన్ని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వీడియోలో పేర్కొన్నారు. ఈరోజు నాకు మార్ఫ్ చేసిన ఫోటో పంపించారు. వెంటనే పోలీసులకు ట్యాగ్ చేశాను. చట్టపరమైన చర్యలు తీసుకుంటారో లేదో ముఖ్యం కాదు. కానీ ఇలాంటి వ్యక్తులు అమ్మాయిలను, వారి కుటుంబాలను వేధించకుండా ఉండేందుకు ఈ వీడియో చేస్తున్నాను' అని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ రిలీజ్ సమయంలో చిన్మయి, ఆమె భర్త రాహుల్ రవీంద్రన్‌పై నెటిజన్లు తీవ్ర విమర్శలు, అసభ్య కామెంట్లు చేశారు. రాహుల్ ..మంగళసూత్రం గురించి మాట్లాడిన పాత వీడియోను బయటకు తీసి, దారుణమైన పదజాలంతో దూషించారు. ఈ సందర్భంలో చిన్మయి మహిళల భద్రతపై వ్యాఖ్యానించడంతో మరింతగా ట్రోలింగ్ జరిగింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కు ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇప్పుడు షేర్ చేసిన తాజా వీడియోలో కూడా చిన్మయి కొంతమంది నెటిజన్ల పేర్లు ప్రస్తావిస్తూ, 'పుట్టిన పిల్లలు చనిపోవాలని కోరుకునే ఇటువంటి అబ్బాయిలకు అమ్మాయిలను ఇచ్చి పెళ్లి చేయాలా?' అంటూ ప్రశ్నించారు. మార్ఫింగ్ ఫోటోలు వచ్చినప్పుడు భయపడకుండా, వెంటనే తమ కుటుంబ సభ్యులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయాలని మహిళలకు సూచించారు. చిన్మయి షేర్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.